

# హాబీ

సామవేదుల వెంకటరామశాస్త్రి

**ఆ రోజు సాయంత్రం ఏం తోచక వెంకట్రావింటికి బయలుదేరేను.**

**నేనూ, వెంకట్రావు ఐదవ క్లాసు నుంచి డిగ్రీదాకా కలిసి చదువుకొన్నాము. లక్కీగా ఇద్దరికీ ఒకే వూరిలో ఉద్యోగాలు దొరికేయి.**

**అయితే నా లక్కు కాస్త బాగుండడం వల్ల నాకు బేంకులో ఉద్యోగం దొరికితే, వాడు మాత్రం బి.ఇ డి. చదివి లెక్కల మాస్టారయ్యేడు.**

సెలవు రోజుల్లోనూ, సమయం చిక్కినప్పుడూ ఇద్దరం కలుసుకొంటూ వుండడం మామూలే.

ఆ రోజు నేను వెళ్ళేసరికి వెంకట్రావు సినిమాలో నాగయ్యగారి పోజులో కూర్చుని వున్నాడు. సంగతేమిటని నేను ప్రశ్నించడమేమిటి, తన సోది చెప్పడం మొదలెట్టేడు.

"ఈ లెక్కల మాస్టారంత దరిద్రపు ఉద్యోగం మరోటి లేదనుకో శంకరం! పిల్ల వెధవలు ఒకటే అల్లరి. పైగా రక రకాల పేర్లు పెట్టి ఏడిపించడం. ఇవన్నీ చాలనట్లు కోర్సు త్వరగా కంప్లీట్ చెయ్యమని హెడ్‌మాస్టరు సతాయింపు. ఈ ఉద్యోగం కంటే ఏ రిక్షాయో లాక్కొని బ్రతకడం నయం" అంటూ, ఉస్సురని అరగజం నిట్టూర్పు వదిలేడు.

ఈ సోది నాకు రోజూ ఉండేదే. అయితే ఈ సారి దీన్ని శాశ్వతంగా పరిష్కరించాలనే కృత నిశ్చయంతో అన్నాను.

"చూడు వెంకూ! ప్రతివాడికీ ఎవరి ఉద్యోగంలో కష్ట నష్టాలు వారికుంటాయి. ఉదాహరణకి, నేనేదో బేంకులో సుఖపడిపోతున్నాననుకొంటున్నావు కదూ! కానీ కస్టమర్స్‌తో గొడవలు. కాష్ టాలీ కాకపోతే చికాకు. అయితే, ఉద్యోగంలో సమస్యలు అక్కడే మర్చిపోవాలి. అలా మర్చిపోవాలంటే నీకు ఏదైనా హాబీ అవసరం!"

"హాబీయా! నాకలాంటివి లేవే" అన్నాడు వెంకట్రావు తెల్లబోయి.

వెంటనే వాడికి హాబీ నేర్పరిచే గురుతరమైన బాధ్యత కూడా నా భుజ స్కంధాల మీదే వుందని గ్రహించేను.

వెంటనే వాణ్ణి దగ్గర్లో ఉన్న లైబ్రరీకి బయలుదేరదీసేను. లైబ్రరీలో వాడు పుస్తకాలు చదువుతున్నంతసేపు కాస్త ఉత్సాహంగా కనిపించేడు.

ఒక గంట తర్వాత ఇంటికి బయలుదేరేను. వాడి సమస్యను పరిష్కరించి. వాడికొక హాబీ నేర్పరిచేనన్న తృప్తితో.

పదిరోజులతర్వాత లైబ్రరీకెళ్తే అక్కడ వెంకట్రావ్ కనిపించేడు. వాడి మొహం చూస్తే చాలా ఉత్సాహంగా వున్నట్లు కనిపించేడు. ఇంకేం. నా ప్రయత్నం ఫలించిందని సంతోషించేను.

ఇద్దరం లైబ్రరీలో కొంతసేపు గడిపి బయటపడ్డాము.

"నీకిప్పుడు టైము బాగానే గడుస్తున్నట్లుందే" అన్నాను వాడివైపు సాలోచనగా చూస్తూ.

"అవునురా! అసలు కాలమంతా లైబ్రరీలోనే గడిపేస్తే బాగుండు ననిపిస్తోంది. అసలు ఇక్కడే లైబ్రరీలో లైబ్రేరియన్ పోస్టు ఖాళీగా వుందిట. దానికోసం తెలిసిన వాళ్ళద్వారా ట్రై చేస్తున్నాను" అన్నాడు. ముఖం చాటంత చేసుకొని.

పదిరోజుల తర్వాత వాడంత పనీ సాధించినట్లు ఓ రోజు ప్రొద్దున్నే హడావిడిగా వచ్చి చెప్పేడు. నేనూ సంతోషించేను.

* * *

ఈ మధ్య నేను ట్రైనింగుకని వెళ్ళి. మూడు నెలల తర్వాత మా వూరొచ్చేను.

మర్నాడు సాయంత్రం వెంకట్రావింటికి వెళ్ళేసరికి అక్కడ మళ్ళీ నాగయ్యగారి పోజులో మావాడు ప్రత్యక్షం.

మళ్ళీ ఏం కొంప మునిగిందోనని "ఏరా కులాసా" అని పలకరించడ మేమిటి. వెంటనే తన సోది పురాణం విప్పేడు.

"ఏం కులాసా బ్రదర్! ఈ లైబ్రేరియన్ జాబంత థర్డ్ జాబ్ మరొకటి లేదనుకో! వచ్చిన వాళ్ళందరూ ఈ పుస్తకం లేదా ఆ పుస్తకం రాలేదా అని ఒకటే సతాయింపు. పైగా ఎప్పుడూ ఒకటే నిశ్శబ్దం. దేనికంటే రోడ్లు ఊడ్చే పని నయమనుకో" అన్నాడు ఈసారి గజం నిట్టూర్పు విడుస్తూ.

వీడికి నేను చేసిన గీతోపదేశం వేస్ట యిందే అని బాధ కలిగినా. మళ్ళీ చెబ్దామనే ఉద్దేశ్యంతో.

"చూడు వెంకూ! నేనింతకు ముసుపు చెప్పింది మర్చిపోలేదనుకొంటాను. ఉద్యోగంలో బాధలు మర్చిపోడానికి హాబీ ఒకటుండాలని నేను చెప్పలేదూ. ప్రస్తుతం నీ హాబీ ఏమిటి" కోర్టులో లాయర్‌లా ప్రశ్నించేను.

"ఏముంది. పిల్లలకు లెక్కల పై 9వేట్లు చెప్పడం" టక్కున చెప్పేడు వెంకట్రావు.

ఈ సారి తెల్లబోవడం నా వంతయింది.

## మందార మకరందాలు

### రోషం లాంటి ఉక్రోషం

కొందరు పిల్లలు అల్లరికి దిగితే ఇల్లుపీకి పందిరి వేస్తున్నారనడం పరిపాటి. కొందరి భార్యలు రుసరుసలాడితే చుట్టుపక్కల వాళ్ళకి కూడా నిద్రాహారాలుండవు.

ఆఫీసులో ఒకొక్క రావణాసురుడుంటాడు. అతనికైతే ఇంటికెళ్ళాలంటే దడ. అందుకే ఆఫీసులోనే కూర్చుని మిగతా వాళ్ళని కూడా వెళ్ళనియ్యకండా వేపుకుతింటాడు. అలా గతిమాలి ఆలస్యంగా భర్త వొచ్చినందుకే మో-ఆవిడకి కోపం వచ్చింది. పాపం పెద్దింటి పిల్ల. మొగుడంటే వల్లమాలిన ప్రేమ. ఏదో సినిమాకి వెడదాం కదా అనుకుంది. మామూలుగా పెందరాళేనే వచ్చేవాడు. ఈ రోజు మాత్రం రాకపోతాడా అనుకుంది. ఉదయాన్నే ప్రత్యేకంగా చెప్పింది కూడా- సినిమాకి వెడదాం వచ్చెయ్యమని- ఓ యస్ అన్నాడు. ఆ మోహనుడు.

అయినా వచ్చేసరికి వేళ దాటిపోయింది. మరి కోపంరాదూ! వచ్చింది ఏడుపు. దాన్నే కోపం రూపంలో ప్రదర్శిస్తోందావిడ. గంట రెండు గంటలు మూడు గంటలు దాటినా ఆ కోపవేగం ఏమాత్రం తగ్గలేదు. అప్పుడు పొరుగింటావిడొచ్చి అంటోంది.

"లిఖన్నాస్తే భూమిం బహిరవనతః ప్రాణదయితో
నిరాహారాస్సఖ్యః సతతరుదితో చ్ఛూననయనా :
పరిత్యక్తం సర్వం హసితపఠితం పంజరశుకైః
తవావస్థాచేయం విసృజకఠినే మానమధునా"

పాపం వీధి వరండాలో కుర్చీలో కూర్చుని మీ ఆయన (బిక్కుబిక్కుమంటూ నేలమీద ఏవో గీసుకున్నాడు. ఈ లేతపిల్లలు నీ ఆడపడుచులిద్దరూ (అంతకంటె సఖియలు ఎవరుంటారేమిటి మహా) ఏడ్చిఏడ్చి కళ్ళు వాచేట్టు చేసుకున్నారు. హుషారుగా నవ్వుతూ కబుర్లాడేచిలకలు పంజరాల్లో ఉలుకూపలుకూ లేకుండా ఉన్నాయి. ఇంక నీ అవస్థ చూస్తే ఇలా ఉంది. (భోజన ఏర్పాడమే తరవాయిగా ఉంది) ఇంకా ఎంతసేపమ్మా ఈ కోపం!

—సౌభరి

## ఫొటో వ్యాఖ్య పోటీ ఫలితం



"ఆశయ శిఖరానికి మెట్లు !
అంత ఎత్తు ఎక్కడ మెట్లు?"

—శ్రీపాద సుబ్రహ్మణ్యం

C/O ఆంధ్రాబ్యాంక్. బిర్కూరు బ్రాంచి.
బాన్సువాడ తాలూకా. నిజామాబాద్ జిల్లా—503 321.

వేలాది మంది పాఠకులు తమ వ్యాఖ్యలను వ్రాసి పంపారు. వాటిలో ఉత్తమమైనదిగా ఎంపికైన ఈ వ్యాఖ్యకు రూ. 25/- నగదు బహుమతి పంపిస్తున్నాము.

—ఎడిటర్